ఫలితాల్లో మేటి... వసతులు నాస్తి!



అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన సముదాయం

అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. సరిపడని తరగతి గదులు.. అసంపూర్తి ప్రహరీ నిర్మాణంతో అవస్థలు పడుతున్నారు. నాడు నేడు పథకంలో నిధులు మంజూరైనా మలివిడత నిధులు విడుదలయ్యే సమయానికి ఎన్నికలు రావడంతో ప్రహరీ నిర్మాణం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కనీసం పట్టించుకోలేదు.

– అగనంపూడి

- అసౌకర్యాల అగనంపూడి కళాశాల
- ఆరు గ్రూపులు.. 486 మంది విద్యార్థులు
- ఈ ఏడాది బైపీసీ గ్రూపు మంజూరు
- విద్యార్థులకు తప్పని వసతి సమస్య
- ప్రిన్సిపాల్, లైబ్రరీ ఒకే గదిలో..
- అదనంగా ఆరు గదులు, రెండు ల్యాబ్‌ల అవసరం
- ప్రిన్సిపాల్ ఒక్కరే రెగ్యులర్ ..
- అతిథి అధ్యాపకులతోనే తరగతులు

అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏటా ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటుతోంది. ప్రభుత్వ కళాశాలల విభాగంలో జిల్లాలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వరుసగా ఐదేళ్ల నుంచి ప్రభంజనం కొనసాగిస్తూ వస్తుంది. అలాగే ఈ కళాశాల నుంచి ఒకరిద్దరు విద్యార్థులు ఏపీఈఏపీసెట్, ఐఐటీకి ఎంపిక అవుతున్నారు. దీంతో ఏటా అడ్మిషన్లు పెరుగుతూ వస్తున్నాయి. వీటికి తగిన విధంగా వసతులు, గదులు పెరగకపోవడంతో విద్యార్థులు ఒకింత అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ కృషికి తర్వాత వచ్చిన ప్రిన్సిపాళ్లు కూడా కొనసాగిస్తుండడంతో ప్రతీ ఏటా ఫలితాల్లో ప్రథమంలో నిలుస్తుండగా...

సౌకర్యాల విషయంలో అథమంగా ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని నిర్మించిన కళాశాల భవన సముదాయానికి ప్రహరీ ఉంటే సౌలభ్యంగా ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు.



పిల్లర్ల దశలో నిలిచిన కాంపౌండ్‌వాల్‌నిర్మాణం

వసతులు కల్పిస్తే అదుర్స్

నాడు నేడు పథకంలో మౌలిక వసతులు, కాంపౌండ్ వాల్, పెయింటింగ్ కోసం గత ప్రభుత్వంలో రూ.52 లక్షల మంజూరు చేశారు. మరుగుదొడ్లు, పెయింటింగ్‌లు పూర్తి చేశారు. ప్రహరీ నిర్మాణానికి అవసరమైన పిల్లర్లు వేశారు. భూ ఉపరితలం వరకు ఫౌండేషన్ కూడా వేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో నిర్మాణం గాలికి వదిలేశారు.



రూఫ్ లేక ఎండకు ఎండి వానకు తడుస్తున్న సరస్వతీదేవి, జాతీయ నాయకుల విగ్రహాలు

ఇదిలా ఉంటే ఈ ఏడాది తల్లిదండ్రులు, స్థానిక ప్రజా సంఘాల విజ్ఞప్తికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించడంతో బైపీసీ గ్రూపు ఏర్పాటు చేశారు. అయితే ఈ గ్రూపునకు రెండు తరగతి గదులు, రెండు ల్యాబ్‌లు అవసరం. ప్రస్తుతం నాలుగు ప్రధాన గ్రూపులు, రెండు ఒకేషనల్ గ్రూపు ఉన్నాయి. రెండు సంవత్సరాల విద్యార్థులకు 12 గదులు అవసరం. అలాగే ప్రిన్సిపల్ గది, కార్యాలయం, స్టాఫ్ రూమ్, ల్యాబ్‌లు, అలాగే ఒకేషనల్ గ్రూపులకు వేర్వేరుగా ప్రయోగాలకు గదులు అవసరం. వీటన్నింటికీ కలిసి 18 గదులు వరకు అవసరం. కాని సరిపడా వసతి లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యాల మధ్య నెట్టుకొస్తున్నారు.

రెగ్యులర్ ఫ్యాకల్టీ మంజూరైనా...

ప్రిన్సిపాల్ కాకుండా మరో ఐదుగురు రెగ్యులర్ ఫ్యాకల్టీ పోస్టులు మంజూరయ్యాయి. అయితే ఈ ఏడాది ఈ ఖాళీలు భర్తీ కాకపోవడంతో ఇద్దరు కాంట్రాక్ట్ అధ్యాపకులతోపాటు 12మంది అతిథి అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. రెగ్యులర్ స్టాఫ్‌ను నియమించి, అదనపు గదులు నిర్మాణం చేపట్టాలని, ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, అసంపూర్తి ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

వచ్చే ఏడాదికి సమస్యే



ఈఏడాదికి విద్యార్థుల వసతికి సమస్య పెద్దగా లేదు. ఐతే ల్యాబ్లు, లైబ్రరీ, కార్యాలయ గది, స్టాఫ్ గదులు కలిపి ఉంటున్నాయి. ప్రహరీ నిర్మాణం ప్రారంభించే సమయంలో మరుగుదొడ్లు, పెయింటింగ్‌లు పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ప్రహరీ నిర్మాణం మధ్యలో ఉండిపోయింది. రెండు వైపులా కాంపౌండ్‌వాల్ ఉంది. మరో రెండు వైపులా పూర్తి చేయడానికి అతి తక్కువ నిధులే అవసరం ఉంటుంది.

ఎస్.కృష్ణవేణి,
ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

క్లుప్తంగా

రేపు వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: ఈ నెల 13న వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నామని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు ఎస్సీ సెల్ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అరకు బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి ఎస్సీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో మార్టుపూడి పరదేశి, రోజా రాణి, కొల్లి దేముడు, డాక్టర్ ఎస్.రాజారావు, వెంకటేష్, ఉమ, వంగలపూడి శ్రీను, రాములు, ప్రకాష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో వినూత్న ప్రయోగాలు



ప్రొఫెసర్ సమంత్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: సాంకేతిక రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల వైద్య రంగంలో వినూత్న ప్రయోగాలు, పరిశోధనలు వస్తున్నాయని ఆర్‌బీటీ గ్లోబల్ క్యాంపస్ (ఐరోపా) నిపుణుడు, ప్రొఫెసర్ డెబాబ్రటా సమంత్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం వర్చువల్ రియాల్టీ ఆధారిత ఆరోగ్య ప్రయోజనాలు, వినూత్న పరిశోధనలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్చువల్ రియాల్టీ టెక్నాలజీతో ఎటువంటి మార్పులకు అవకాశం, ఆస్కారం ఉందో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి 17న శ్రీకారం



పూజలు చేస్తున్న కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని పెంటమాంబ ఆలయ ఆవరణలో కొలువుదీరిన మహాశక్తి, భూలోకమ్మ, దుర్గాలమ్మ, కుంచుమాంబ, మరిడిమాంబ, శ్రీశక్తి అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. నెల్లిముక్కు గ్రామ పెద్దలు, దొడ్డి పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 17న ఆలయాల పునర్నిర్మానికి శంకుస్థాపన చేస్తామన్నారు. భక్తులు, దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, గొందేశి సత్యారావు, గంట్యాడ పైడిరాజు, మొల్లి రమణ, కేఎస్ రెడ్డి, పిట్టా కుంచారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇటీవల తొలగించిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇచ్చి ఎన్నో ఏళ్లుగా ప్లాంట్‌లో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులను కూడా తొలగించడం అన్యాయమన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో మాట్లాడి కార్మికుల అంశంపై చర్చిస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



అప్పారావు (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. అగనంపూడికి చెందిన తాడి అప్పారావు (54) కోక్‌ఓవెన్స్ విభాగంలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న ఓ కన్‌స్ట్రక్షన్స్‌లో అన్‌స్కిల్డ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం సీపీపీ విభాగంలో క్లీనింగ్ పనులకు హాజరయ్యాడు. అక్కడ జరిగిన ప్రమాదంలో గాయపడడంతో తొలుత స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అప్పారావు మృతి చెందాడు. కార్మిక సంఘాల నాయకులు సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించారు. చట్టప్రకారం అతనికి రావాల్సిన పరిహారంతో పాటు కుటుంబానికి రూ. 1.21 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు కుటుంబీలకు ఉపాధి కల్పించడానికి అంగీకరించారు. దీంతో నాయకులు శాంతించారు.

కేవీలో రక్షాబంధన్



రాఖీలు కడుతున్న విద్యార్థినులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టారు. దీంతో పాఠశాల ఆవరణలో పండగ వాతావరణం నెలకొంది. పాఠశాల ఉపాధ్యాయులు రాఖీ పండగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటా..



జీవీఎంసీ కమిషనర్‌కు 87వ వార్డులో సమస్యలు వివరిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం 87వ వార్డులో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. స్పోర్ట్స్ కాంప్లెక్సు కోసం కేటాయించిన 4.50 ఎకరాల స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. స్థల వివరాలను కమిషనర్‌కు వివరించారు. అక్కడ భవిష్యత్‌లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మంచినీటి సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు. మరో12ఎండీల ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాలని కోరారు. అలాగే ప్రధాన రహదారి, మురుగు కాలువలు విస్తరణ వంటి సమస్యలను కమిషనర్‌కు వివరించారు. మౌలిక వసతులు కల్పించడానికి నిధులు కేటాయిస్తామని కమిషనర్ వెల్లడించారు.తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

పెద గంట్యాడ మండలంలో...

పెదగంట్యాడ: కొత్త గాజువాక జంక్షన్ నుంచి బాలచెరువు రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వరకూ 40 అడుగుల నుంచి 100 అడుగుల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్‌తో కలసి మండలంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పలు సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అగనంపూడి: ప్రతిపాదనల మేరకు సీఎస్ఆర్ నిధులతో ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించేందుకు కమిటీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి ఆస్పత్రి నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా కమిటీ సభ్యులు దాసరి త్రినాథ్, డొక్కా రమేష్, కోసూరి తాతారావు, గజ్జల రమణమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ కమిటీ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు తోడ్పాటు నందించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రి సేవలను చేరువ చేయడానికి కమిటీ పనిచేయాలని సూచించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులపై ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ, ఏవో రవిరాజ్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ



విద్యార్థులకు కంచాలు పంపిణీ చేస్తున్న పెంటబాబు

పెదగంట్యాడ: సమాజ సేవకుడు బెల్లాల సత్యానందం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు బెల్లాల పెంటబాబు జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు సోమవారం స్టీల్ కంచాలు, గ్లాసులు, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కులుకూరి మంగరాజు, బొడ్డు కృష్ణారావు,వెంకటరావు, వర్ధన్, ప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

గాజువాక: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వాడ ప్రాంతానికి చెందిన తిలపాల నాని, గాజువాక డిపో ప్రాంతానికి చెందిన జడ్డా రమేష్, ములగాడ ప్రాంతానికి చెందిన గురజాపు నితీష్ అరకులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేసి రెండు ద్విచక్ర వాహనాలపై గాజువాక తీసుకొస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గాజువాక ఎస్ఐ ఎల్.సూర్యకళ జింక్ మైదానంవద్ద తనిఖీ చేపట్టారు. జింక్‌లోకి ప్రవేశిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఆమెను చూసి వెనక్కి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆరా తీశారు. తాము గంజాయి కొనుగోలు చేశామని, గాజువాక ప్రాంతంలో ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి తీసుకొచ్చినట్టు నిందితులు చెప్పారని సీఐ పార్థసారథి పేర్కొన్నారు. గంజాయితో పాటు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మారని తీరు.. పారని మురుగు

- ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన గెడ్డలు
- క్షీణిస్తున్న పారిశుధ్యం
- వృద్ధి చెందుతున్న దోమలు



నెల్లిముక్కు కుంచుమాంబ ఆలయ వెనుక చెత్తతో నిండిపోయిన గెడ్డ



పెంటమాంబ ఆలయం సమీపంలో గెడ్డలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు

పెదగంట్యాడ: మండలంలోని పలు ప్రాంతాల్లోని గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఎటు చేసినా చెత్తా చెదారమే దర్శనమిస్తోంది. ఏ గెడ్డ చూసినా పూడికలతో నిండిపోయి కనిపిస్తోంది. మురుగు పారక పోవడంతో దుర్వాసనతో పాటు దోమలు దండయాత్రతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దోమకాటుకు విలవిల్లాడుతున్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో ప్రధాన గెడ్డలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ గెడ్డలు చెత్తాచెదారం, పూడికలతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. మురుగునీరు సాఫీగా పారకుండా నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే దోమలు కూడా విజృంభిస్తున్నాయి. ఒక పక్క దుర్వాసన, మరోపక్క దోమల బెడద కారణంగా స్థానికులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. చెత్త, పూడికల కారణంగా భారీ వర్షాలు పడినప్పుడు గెడ్డలకు అడ్డం పడుతున్నాయి. దీంతో ఆ నీరంతా జనావాసాల్లోకి వచ్చేస్తోంది. నెలలు తరబడి గెడ్డల్లో పూడికలు, చెత్త తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణవేణి

పెదగంట్యాడ: నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రొబేషనల్ ఎస్ఐ ఎల్ కృష్ణవేణి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధి అయ్యన్నపాలెంలో నేరాల నియంత్రణపై మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విలువైన బంగారు ఆభరణాలు వేసుకుని ఒంటరిగా వెళ్లవద్దన్నారు. చైన్‌స్నాచర్ల బెడద ఎక్కువగా ఉందని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బంగారు ఆభరణాలు ధరించి ఇళ్లలోని కిటికీల వద్ద నిద్రించవద్దన్నారు. వాహనాలకు తాళాలు వేయడంతో పాటు జీపీఎస్ వంటి సాంకేతికతను వినియోగించుకోవాలని కోరారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే పెద్ద నష్టాన్ని నివారించవచ్చని వివరించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో న్యూపోర్టు క్రైం హెడ్ కానిస్టేబుల్ సుశీల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీతో ఇక్కట్లు



కాళింగవీధిలోని ట్రాన్స్‌ఫార్మర్

కూర్మన్నపాలెం: విద్యుత్ లోవోల్టేజీ సమస్య కణితి కాళింగ వీధి ప్రజలను పట్టి పీడిస్తోంది.మూడు నెలలుగా అర్ధరాత్రులు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు చోటుచేసుకోవడం, కొన్నిసార్లు సరఫరా నిలిచి పోతుండడం వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 87వ వార్డులోని రామాలయానికి సమీపంలోని ఇళ్ల వారు చీకట్లో గడపాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. లోవోల్టేజీ వల్ల టీవీలు, ఫ్రిడ్జ్‌లు పాడై పోతున్నాయని అక్కడి వారు చెబుతున్నారు. సమస్యపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపురాము, పి.వేణు.దానప్పలు వడ్లపూడి ఏఈకి ఫిర్యాదు చేసినా నేటికీ పరిష్కారం కాలేదని కాలనీ పెద్దలు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మారిస్తే కొంతవరకు సమస్యనుంచి గట్టెక్కవచ్చునని వారు అభిప్రాయ పడుతున్నారు.

రేషన్ సరకుల వితరణ



రేషన్ సరకులు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

గాజువాక: తుంగ్లాం గ్రామానికి చెందిన జి.సుధీర్ రెడ్డి స్థానిక డిజైర్ సొసైటీలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు సోమవారం రూ.35వేల విలువ చేసే రేషన్ సరకులు అందజేశారు. ప్రతినెలా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పశు వైద్యశాల నిర్మించాలని వినతి

అగనంపూడి: శిథిలావస్థలో ఉన్న అగనంపూడి పశువైద్యాలయం స్థానంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అగనంపూడి పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పి.లావణ్య ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. అగనంపూడి ఆస్పత్రిలో కలిసి ఆమె సమస్యలు వివరించారు.

పదవీ విరమణ ఖాళీలు భర్తీ చేయాలి

అగనంపూడి: జీవీఎంసీ పారిశుధ్య విభాగంలో పదవీ విరమణలు పెరుగుతున్నాయి... అకాల మరణాలు నమోదవుతున్నా ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడు గొలగాని అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1లో పాశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ, మరణించిన వారి వారసులను నియమించాల్సి ఉండగా ఉపాధి కల్పించడం లేదన్నారు. అలాగే అప్పట్లో పుట్టిన తేదీలు సరిగా తెలియ పోవడంతో ఏదో ఒక తేదీ వేసుకున్నారని, వయోభారం కాకపోయినా ఆప్కాస్ కార్మికులను తొలగిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సిబ్బందిని నియమించి అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అరుణ, లక్ష్మి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.